ప్రజాశక్తి
గురువారం 31 జులై 2025
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విజయవాడలోని పాత బస్టాండ్ స్థలం

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఉద్యమం

లూలూకు కట్టబెట్టడంపై ఆగ్రహం

ప్రజాశక్తి-విజయవాడ

ఎంతో చరిత్ర, విలువైన విజయవాడ ఆర్టీసి పాత బస్టాండ్ స్థలాన్ని బహుళజాతి కంపెనీ అయిన "లులు" కంపెనీకి కారు చౌకగా కట్టబెడుతూ ఆగమేఘాల మీద 137 జీఓను ప్రభుత్వం జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాత బస్టాండ్, గవర్నరుపేట - 2 డిపో, విద్యాధరపురం డిపోల స్థలాలను బహుళజాతి కంపెనీ లూలూకు అప్పగించి ఏడాదిలోగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి (రాళ్లచెరువు) ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వం నిర్ణయంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాత బస్టాండ్ ఉమ్మడి రాష్ట్రంలో ప్రధానంగా ప్రజా రవాణాలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఉద్యోగ, కార్మిక ఉద్యమాలకు నిలయంగా ఉండేది. ఆర్టీసి యాజమాన్యం తీసుకున్న పలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు, ఇతర పలు పరిణామాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు కేంద్ర బిందువుగా ఉండేదని ఆర్‌టిసి యూనియన్లతోపాటు వామపక్ష పార్టీలు, ఇతర రాజకీయపక్షాలు గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పిఎన్ బస్టాండ్ ప్రదేశంలో ఆనాడు భాస్కరావుపేట డిపో ఉండేది. ఈడిపోను 1994-95 ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న విజయవాడ పాత బస్టాండ్ ప్రాంతానికి మార్పు చేసిన (మిగతా 2లో)

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-విజయవాడ: ఆర్‌టిసికి చెందిన విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పౌర వేదిక ఆధ్వర్యాన గురువారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని బాలోత్సవ్ భవన్ 2వ అంతస్తులో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని వేదిక నాయకులు వై.రమేష్ తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్‌లో ఆర్‌టిసిలోని వివిధ సంఘాలు, పెన్షనర్స్ అసోసియేషన్, వ్యాపార సంస్థలు, వివిధ పౌర సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొంటారని తెలిపారు.

నేడు 'క్వాంటమ్ సైన్స్ - వ్యాలీ - పాలన'పై సదస్సు

హాజరుకానున్న ప్రబీర్ పుర్కాయస్త

ప్రజాశక్తి-విజయవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన గురువారం సాయంత్రం 6.30 గంటలకు విజయవాడలోని బాలోత్సవ్ భవన్ 2వ అంతస్తులో "క్వాంటమ్ సైన్స్, క్వాంటమ్ వ్యాలీ..పాలన (డీ కోడింగ్ ది ఫ్యూచర్)" అంశంపై సదస్సు జరుగుతుందని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్, రాష్ట్ర నాయకులు జి.మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా శాస్త్రవేత్త, ఢిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపక నాయకులు, విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ కంట్రోల్ ప్యానల్ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించి ప్రఖ్యాత ఇంజినీర్, న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్ ప్రధాన సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్త ప్రసంగిస్తారని తెలిపారు.

బ్యారేజీకి వరద ఉధృతి

- ఇన్‌ఫ్లో 1,21,679, అవుట్‌ఫ్లో 1,04,750 క్యూసెక్కులు
- కాల్వలకు 16,929 క్యూసెక్కులు విడుదల

బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధతి కొనసాగుతోంది. ఎగువనున్న శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరగడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం మరింత పెరిగింది. బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 1,21,679 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,04,750 క్యూసెక్కులుగా ఉంది. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 10,207 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 6,522 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కులను విడుదల చేశారు. మొత్తం 16,929 క్యూసెక్కుల వరద నీటిని కాల్వలకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. బ్యారేజీ 70 గేట్లలో 10 గేట్లను మూడు అడుగులు, 60 గేట్లను రెండు అడుగుల మేర (మిగతా 6లో)

ధర్నాలో సిఐటియు, సిపిఎం నాయకులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, పి.వి.ఆంజనేయులు తదితరులు, సిఐటియు నాయకులు సిహెచ్.సుధాకర్‌తో వాగ్వాదానికి దిగిన పోలీసులు

గిరిజన పారిశుధ్య కార్మికురాలిపై

టిడిపి నేత దాడి

- కారుతో ఢీకొట్టి కాలితో తన్ని...
- రోడ్డుపై బైఠాయించి పంచాయతీ కార్మికుల ధర్నా
- సంఘీభావం తెలిపిన సిఐటియు, సిపిఎం నేతల అరెస్టు
- మైలవరంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం పంచాయతీ పారిశుధ్య కార్మికురాలిపై అధికార టిడిపికి చెందిన నేత దాడిచేశాడు. గిరిజన కార్మికురాలిని కారుతో ఢీకొట్టి, కాలితో విచక్షణా రహితంగా తన్ని దూర్భాషలాడాడు. దీంతో దాడి చేసిన టిడిపి నేతను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటరులో ప్రధాన రహదారిపై కార్మికులు బైఠాయించి ధర్నా దిగారు. నాలుగు గంటలకు పైగా నిర్వహించిన ధర్నాకు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్న సిపిఎం, సిఐటియు, (మిగతా 2లో)

చిన్న పరిశ్రమలకు షాక్

- మూతపడే స్థితిలో జగ్గయ్యపేట ఆటోనగర్ షెడ్లు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- స్మార్ట్ విద్యుత్ బిల్లులతో యజమానులు బెంబేలు



శ్రీకృష్ణ స్టీల్స్ ఫర్నీచర్ యజమాని కృష్ణకు విద్యుత్ బిల్లులో వచ్చిన వ్యత్యాసం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని, మళ్లీ ఛార్జీలను పెంచబోమని కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలని గత వైసిపి ప్రభుత్వ హయాంలో పిలుపునిచ్చిన మంత్రి లోకేష్ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పెట్టిస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు వినియోగదారులపై పెను భారం మోపుతున్నాయి. ఎనర్జీ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, అదనపులోడు ఛార్జీల పేరుతో మొత్తంగా విద్యుత్ ఛార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. మళ్లీ ఇవి చాలవన్నట్లు అదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణ సమీపంలో 1985లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి)కు చెందిన 150 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పడింది. ఈ ఆటోనగర్లో ప్రస్తుతం ఆరు ఫార్మా కంపెనీలు, ఒక టైర్ కంపెనీ, ఒక పారామౌంట్ కంపెనీ, లారీ బాడీ బిల్డింగ్ తయారీ, కార్ మెకానిక్ షెడ్లు, బీరువా కంపెనీలు, సోఫా సెట్లు తయారీ, సీలింగ్ షీట్ల తయారీ, బాదం పప్పుల ప్యాకింగ్, పివిసి కరెంట్ పైపులు తయారీ, సిమెంట్ ఇటుకల తయారీ, ఐరన్, ప్లాస్టిక్ క్రాఫ్, ఆటోమొబైల్స్, ఆక్సిజన్ జనరేటింగ్ ఫ్యాక్టరీ, టైర్ పంచర్స్, వెల్డింగ్, పెయింటింగ్ వంటి 350 కుటీర, చిన్న తరహా, మధ్యతరగతి పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆటోనగర్‌లోని ఓ కార్ (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఉద్యమం

తర్వాత గవర్నర్‌పేట-2 డిపోగా నామకరణం చేశారు. గవర్నర్‌పేట-2 డిపో ఏర్పాటు చేయక ముందు నుండీ ఇక్కడ పాత బస్టాండ్ నడిచేది. బస్టాండ్ స్థలానికి దాదాపు 70 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. 1991 సిటీ రూట్లను జాతీయకరణ చేసిన తర్వాత పాత బస్టాండ్ ప్రాధాన్యత మరింత పెరిగింది. ఇటు పిఎన్ బస్టాండ్, అటు రైల్వేస్టేషన్‌కు కూత వేటు దూరంలో గవర్నర్‌పేట-2 డిపో ఉంది. అన్ని వేళల్లో ప్రయాణీకులకు ఎంతో అందుబాటులో ఉంటూ ప్రజారవాణా వ్యవస్థకు చిరునామాగా నిలిచింది. ఇదే క్రమంలో నగరంలో విద్యాధరపురం డిపో, భాస్కరరావుపేట డిపో, గవర్నర్‌పేట-1 డిపో ఏర్పడ్డాయి. ఇబ్రహీంపట్నం డిపో మాత్రం వీటికి ముందే ఏర్పడింది. ఆ తర్వాత ఆటోనగర్ డిపో ఏర్పాటైంది. అయితే భాస్కరరావుపేట డిపోను ప్రస్తుతం ఉన్న గవర్నర్‌పేట-2 డిపోగా మార్పు చేయగా, అప్పటి వరకు ఇక్కడ ఉన్న విజయవాడ డిపోను మాత్రం ప్రస్తుతం పిఎన్ బస్‌స్టేషన్ ప్రాంగణంలోకి మార్పు చేశారు. తాజాగా పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేస్తూ కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేయడం పలు వర్గాలను విస్మయానికి గురిచేసింది. పాత బస్టాండ్, గవర్నర్‌పేట-2 డిపో స్థలం విస్తీర్ణం 4.2 ఎకరాలు ఉంది. ఈ డిపో పరిధిలో 134 సర్వీసులతో (86 బస్సులు), 550 మంది వివిధ స్థాయిల్లో ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. 27 రూట్లలో రోజుకు 25 వేల కిలోమీటర్లకుపైగా సర్వీసులను నడుపుతుంటారు. 35 వేల మందికి పైగా ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. రోజుకు సరాసరిన రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. 333 జిఎస్- ఘంటసాల, 333 డి డోకిపర్రు, 333 జి గుడ్లవల్లేరు-వడ్లమన్నాడ, 333 పామర్రు, 333 కె కొమరోలు (ఎన్‌టిఆర్ అత్తగారి గ్రామం), 333 పి పెదమొత్తేవి, 308 విసన్నపేట, 301 అమరావతి, 345 హైకోర్టు -సచివాలయం, 48 కండ్రిక-ఆటోనగర్, 16వి వాంబేకాలనీ, 16 ఆర్ఆర్ రాజరాజేశ్వరిపేట, విజయవాడ-కోదాడ రూట్‌లో ఏడు సర్వీసులు గవర్నర్‌పేట-2 డిపో పరిధిలో సర్వీసులు నడుస్తున్నాయని అధికారులు వివరిస్తున్నారు.

2017లోనూ ప్రైవేటుకు ప్రయత్నం

2017లోనే ఈ డిపోను ఇక్కడ నుంచి తరలించి, ప్రయివేటు కంపెనీలకు ఇవ్వాలని అప్పట్లో సిఎం చంద్రబాబు ప్రయత్నించారు. స్వయంగా ఈడిపోను పరిశీలించి వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించి వెళ్లారు. అయితే డిపోను తరలించడానికి వీల్లేదని యూనియన్లకు అతీతంగా పది రోజులపాటు కార్మికులు ఉద్యమించారు.

టిడిపి నేత దాడి

ఇతర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నేతల అరెస్టు సమయంలో పారిశుధ్య కార్మికులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో మైలవరంలో ఉద్రిక్తత ఏర్పడింది.

బాధితురాలి కథనం ప్రకారం...మైలవరంనకు చెందిన భవానీ... భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లల బాధ్యతను తన భుజాలపై వేసుకుని పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం పంచాయతీలోని రామకృష్ణ కాలనీలో చెత్త సేకరణకు వెళ్లింది. అక్కడ ఓ గృహిణి ఎంతసేపటికి వస్తావు, చెత్త ఎప్పుడు ఎత్తుతావు అంటూ భవానీని దుర్భాషలాడింది. అంతేగాక ఆ గృహిణి...టిడిపి నాయకుడు కటారి ఉమామహేశ్వరరావుకు ఫోన్ చేసింది. దీంతో ఉమామహేశ్వరరావు ఆగమేఘాలపై కారులో వేగంగా వచ్చి భవానీని ఢీకొట్టాడు. దీంతో ఆమె పక్కకు తూలిపడింది. అంతేగాక కారులో నుంచి కిందికి దిగి కాళ్లతో తన్నాడు. "చెత్త సక్రమంగా ఎత్తటం లేదు, మీరెంత ! మీ బతుకులెంత !, లేబర్ దానా, చెత్త ఏరుకొనే వారు. మీరెంత ? మీ బతుకులెంత??" అంటూ పత్రికల్లో రాయలేని విధంగా అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడి చేశాడు. చెంపలు, గుండెలు, నడుముపై చేతితో కొట్టి, కాలితో తన్ని అమానుషంగా దాడి చేశాడు. కొద్దిసేపటి తర్వాత పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్న భవానీ...జరిగిన విషయాన్ని మిగతా కార్మికులకు తెలిపింది.

సిపిఎం, ప్రజా సంఘాల నేతల సంఘీభావం

విషయం తెలుసుకున్న కార్మికులంతా మైలవరం పంచాయతీ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. సుమారు నాలుగు గంటలకుపైగానే ధర్నా జరిగింది. దాడి చేసిన ఉమామహేశ్వరావును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ఆంజనేయులు, సిఐటియు మైలవరం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, స్థానిక నాయకులు సందీపం ఇస్సాక్, ఐలు నాయకులు రావూరి రమేష్ బాబు తదితరులు సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికురాలిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికార టిడిపి నేత దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమించాలని కోరారు. తమకు న్యాయం చేయాలని, దాడి చేసిన ఉమామహేశ్వరావును వెంటనే అరెస్టు చేయాలని పారిశుధ్య కార్మికులు, నేతలు నినాదాలు చేస్తూ అక్కడే భీష్మించుకు కూర్చున్నారు. ఈలోగా సీఐ దాడి చంద్రశేఖర్ మరికొందరు పోలీసులు అక్కడికి వచ్చి ధర్నా చేస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు పి.వి.ఆంజనేయులు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సిహెచ్.సుధాకర్, ఎం.మహేష్, షద్రక్‌లను బలవంతంగా అరెస్టు చేసి జీపులోకి ఎక్కిస్తుండగా, పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకూ, పారిశుధ్య కార్మికులకూ మధ్య తోపులాట జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. అనంతరం భవానీని బలవంతంగా మైలవరం ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం పోలీసులు తరలించారు. సిపిఎం, సిఐటియు నేతలను అరెస్టు చేసి మైలవరం, రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంచి విడిచిపెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కటారి ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

మైలవరం గ్రామ పంచాయతీ మహిళా కార్మికురాలిపై అమానుషంగా దాడి చేసిన కటారి ఉమామహేశ్వరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకపోగా, కార్మికులకు సంఘీభావం తెలిపిన సిపిఎం, సిఐటియు నేతలను అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల వైఖరి నిందితుడి పలుకుబడిని చూసి ఉదారంగా వ్యవహరిస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. వెంటనే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అమానుషంగా దాడి చేసిన ఉమామహేశ్వరరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

చిన్న పరిశ్రమలకు షాక్

మెకానిక్ షాపుకు గత జనవరి, ఫిబ్రవరిల్లో నెలకు సుమారు రూ.1500 బిల్లు వచ్చేది. ఆ తర్వాత కరెంటు ఛార్జీలకు ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, అదనపులోడు ఛార్జీల పేరుతో రూ.2,500 బిల్లు వచ్చింది. ఇక స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత ఏకంగా నెలకు రూ.5 వేల వరకూ వస్తోంది. దీంతో కుటీర, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులు స్మార్ట్ మీటర్ల బిల్లులకు షాక్ తింటున్నారు. ఒకపక్క షాపులకు అద్దెలు, మరోపక్క కరెంటు కోతలు, ఇంకోపక్క స్మార్ట్ మీటర్ల విద్యుత్ బిల్లులతో పరిశ్రమ యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. సక్రమంగా పనుల్లేక ఖర్చులు ఎక్కువై ఆదాయం తగ్గిపోవడంతో ఆయా పరిశ్రమల్లోని కార్మికులను తగ్గించుకుంటున్నాయి. మరికొన్ని పరిశ్రమలు మూత పడే పరిస్థితులు దాపురించాయి. చిల్లకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే కమర్షియల్, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 2 వేల స్మార్ట్ మీటర్లు బిగించాల్సి ఉండగా, ఇప్పటికే 1500 స్మార్ట్ మీటర్లు బిగించినట్లు తెలిసింది.

ఆటోనగర్లో సయ్యద్ మస్తాన్ వల్లి కార్ మెకానిక్ షెడ్‌కు (సర్వీస్ నెంబర్ 6333218 002460) గతంలో రూ.1800 కరెంట్ బిల్లు వచ్చేది. ఇప్పుడు స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత రూ.4 వేలు వస్తోంది. పఠాన్ ఇస్మాయిల్ లారీ బాడీ బిల్డింగ్ వర్క్స్ షెడ్‌కు (సర్వీస్ నెంబర్ 6333218001726) స్మార్ట్ మీటర్లు పెట్టక మునుపు రూ.2,800 బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్ పెట్టిన తర్వాత రూ.5,322 వస్తోంది. డి కష్ణ శ్రీకష్ణ స్టీల్ ఫర్నిచర్ వర్క్స్ షెడ్‌కు (సర్వీస్ నెంబర్ 6333218001620) ఫిబ్రవరిలో 730 యూనిట్లకు రూ.7,378 బిల్లురాగా, స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత ఏప్రిల్లో 625 యూనిట్లకు రూ.25,591 వచ్చింది. ఎల్ బోసు మాషా అల్లా లారీ బాడీ బిల్డింగ్ వర్క్స్ షెడ్‌కు (సర్వీస్ నెంబర్ 6333218002324) గతంలో రూ.1500 నుండి రూ.1800 వరకు కరెంట్ బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత రూ.5 వేల వస్తోంది.

ఆదాయం తగ్గింది... ఖర్చులు పెరిగాయి

సయ్యద్ మస్తాన్ వలీ, కార్ మెకానిక్, ఆటోనగర్.

ప్రస్తుతం మా షెడ్‌లో 9 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ కార్మికులకుసైతం సక్రమంగా వేతనాలు కూడా చెల్లించే పరిస్థితి లేదు. గతంలో నెలకు రూ.1500 కరెంటు బిల్లు వస్తే, ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల కారణంగా రూ.4 వేల వరకు వస్తోంది. దీంతో షెడ్‌ను నిర్వహించలేక, మూతవేయలేక సతమతమవుతున్నా. భవిష్యత్తులో ఇదే పరిస్థితి కొనసాగితే షెడ్ మూసేసి డ్రైవర్‌గా వెళ్లాల్సి వస్తుంది.

స్మార్ట్ మీటర్ బిల్లులతో బెంబేలు

పఠాన్ ఇస్మాయిల్, బాడీ బిల్డింగ్ వర్క్స్ మేస్త్రి

స్మార్ట్ మీటర్ల బిల్లు చూడగానే షాక్ కొడుతోంది. బిల్లులు ఇలాగే కొనసాగితే షెడ్‌ను నడిపే పరిస్థితి ఉండదు. గతంలో రూ.2,500 వచ్చే బిల్లు కాస్తా, ప్రస్తుతం రూ.5,500 వరకూ వస్తోంది. మా షెడ్‌లో గతంలో మొత్తం 10 మంది వర్కర్లు ఉండేవారు. పనుల్లేకపోవడం, కరెంటు బిల్లులు అధిక మొత్తంలో రావడం, అధిక మొత్తంలో అద్దెలు చెల్లించాల్సి రావడంతో ఖర్చులు తగ్గించుకునేందుకు ఆరుగురు వర్కర్లను తీసివేయాల్సి వచ్చింది.

ఆన్లైన్ పేమెంట్, అప్డేట్ కోసమే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నామని చెప్పారు

కొత్తపల్లి నాగేశ్వరరావు, కార్ మెకానిక్

మా షాపులకు వచ్చిన అదానీ కంపెనీ సిబ్బందికి స్మార్ట్ మీటర్లు బిగించొద్దని చెప్పాము. అయితే ఆన్లైన్ పేమెంట్, అప్డేట్ కోసమేనని చెప్పి వీటిని బిగించారు. గతంలో మాకు కరెంటు బిల్లు రూ.3,500 వచ్చేది. స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత రూ.5,600 వరకు బిల్లు వస్తోంది. మొత్తం ముగ్గురు కార్మికులతో షెడ్డు నడుపుతున్నాము. ఆదాయం తక్కువగా ఉండటంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఈవత్తి మానేయలేక, మరో వత్తికి వెళ్లలేక సతమతమవుతున్నాము.

స్మార్ట్ మీటరు దెబ్బకు లోడ్ కెపాసిటర్ పెట్టించా

డి.కృష్ణ, యజమాని, శ్రీకృష్ణ స్టీల్స్ ఫర్నీచర్

మా షాపులో 20 మంది కార్మికులతో మంచాలు, బీరువాలు, ఫర్నీచర్ వంటివి తయారు చేస్తున్నాం. మా షెడ్‌కు జనవరి, ఫిబ్రవరిల్లో నెలకు రూ.7 వేల కరెంట్ బిల్లు వచ్చింది. స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత నెలకు రూ.25 వేలు వచ్చింది. ఈ బిల్లు చూసి షాక్ అయ్యా. విద్యుత్ ఎఇ, ఎడిలను కలిసి సమస్యను వివరించా. ఇలానే కరెంటు బిల్లు వస్తే షాపును మూసివేస్తానని చెప్పినా పట్టించుకోలేదు. దీంతో మీటరు టెస్టింగ్ కోసం రూ.1000 చలానా కట్టా. ఆ తర్వాత మీటరు పరీక్షించి మార్పు చేశారు. ఐదేళ్ల క్రితం 5 కెవి కెపాసిటర్‌ను ఏర్పాటు చేశా. దానిని మీటర్ వద్ద బిగించినా బిల్లు తగ్గలేదు. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించా. తెలిసిన వారి సలహాతో లోడ్ ఎక్కడైతే ఎక్కువ అవుతుందో అక్కడ కెపాసిటర్ పెట్టా. దీంతో రూ.25 వేలు వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.11 వేలకు తగ్గింది.

ఇలాగే బిల్లు వస్తే షెడ్డు మూతే...

ఎల్.బోస్ మాషా అల్లా, బాడీ బిల్డింగ్ వర్క్స్ యజమాని

మా షాపులో ప్రస్తుతం ఆరుగురు కార్మికులు లారీ బాడీ బిల్డింగ్ వర్క్ పనులు చేస్తున్నారు. మా షెడ్‌కు కరెంటు బిల్లుకు గతంలో రూ.1500 నుండి రూ.1800 మాత్రమే ఇచ్చేది. స్మార్ట్ మీటర్ పెట్టిన తర్వాత రూ.5 వేలు వస్తోంది. పనులు చేయకపోయినా రూ.5 వేలకు తగ్గడంలేదు. ఇలానే బిల్లులు వస్తే షెడ్ నిర్వహణ కష్టం. ఇక మూసివేయడమే మంచిది. బిల్లు ఎక్కువ వస్తోందని లైన్‌మన్, సబ్ ఇంజినీర్, ఎఇలను అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది.

మహారాజశ్రీ విజయవాడ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు

O.S.No. 398/2021

Between:

పైలా ప్రసాద్ ...వాది

మరియు

పామర్తి వెంకటేశ్వరరావు .... ప్రతివాది

To

ప్రతివాది యొక్క అడ్రసు :

పామర్తి వెంకటేశ్వరరావు, తండ్రి: పామర్తి శ్రీనివాసులు, డోర్ నెం. 40-1-118, మీనాస్టీల్ ప్రక్క కాంప్లెక్స్, ఎస్.వి.ఎస్. కళ్యాణమండపం రోడ్డు, బెంజిసర్కిల్, విజయవాడ-10.

పై దావాను శ్రీ కోర్టువారు మీ హాజరు కొరకు ది. 05-08-2025నకు వాయిదా వేసి యున్నారు. మీరు ది. 05-08-2025న ఉదయం 10.30 ని॥ లకు పై దావా నందు శ్రీ కోర్టు వారి ముందు మీరు స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెనని ఒకవేళ మీరు హాజరు పడని యెడల పై దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 05-08-2025

ఇట్లు
జి.నాగిరెడ్డి,
వాది తరపు న్యాయవాది,
కృష్ణలంక, విజయవాడ-13.
సెల్ నెం. 9885084449

IN THE COURT OF THE XV ADDITIONAL DISTRICT JUDGE AT NUZVID

E.P. NO.457/2022 IN A.C.NO.215/2013

Between:

SHRIRAM CITY UNION FINANCE LIMITED ....DHR

AND

DARA HANUMANTHA PRASAD AND ANOTHR ....JDRS

JDR NO 2 : BOLLA VENKATESWARA RAO, S/O PULLAIAH, AGED ABOUT 49 YEARS, GOVT. EMPLOYEE, MPUP SCHOOL, NADIMI TIRUVURU, KRISHNA DT, PRASENT NTR DT.

పై నెంబరు ఇ.పి.ను DHR M/S SHRIRAM CITY UNION FINANCE LIMITED, JDR ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో 2 వ జేడీఆర్కి నోటిస్ నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది.12.08.2025 నకు** వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు మీరు స్వయంగా గానీ వారి తరపున మీ అడ్వకేట్ గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపు కోనవలెను. లేనియెడల ఇ.పి. మీ పై శ్రీ కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించుదురు.

వాయిదా తేది: 12.08.2025

/// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ///

విజయవాడ
తేదీ :28.07.2025.

కే జే డిక్సన్
డిహెచ్‌ఎర్ తరపు న్యాయవాది

మహారాజశ్రీ గౌరవనీయులైన జిల్లా కన్స్యూమర్ డిస్ఫూట్స్ రెడ్రెస్సల్ కోర్టు :: కర్నూలు

I.A. N0. 93/2025 IN

C.C.No. 76 / 2025

M/S ప్రసాద్ ట్రేడింగ్ కంపిని.
డోర్ నెం. 28/5, K.C. రోడ్, నంద్యాల టౌన్ & డిస్ట్రిక్ట్,
ప్రొప్రేటర్ : కూర శ్రీనివాసులు .... కంప్లైనేంట్

V/S

శ్రీనివాస జనరేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్
Plot నెం. 131, Flat నెం. 2 ఫస్ట్ ఫ్లోర్,
శ్రీ భవ్య రెసిడెన్సి, గొలి కృష్ణ స్ట్రీట్, రామవరప్పాడు,
విజయవాడ - 521 108 కృష్ణాజిల్లా.
...........రెస్పాండెంట్/ ఆపోజిట్ పార్టీ

రెస్పాండెంట్/ ఆపోజిట్ పార్టీకి సమన్లు

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ / ఆపోజిట్ పార్టీ అయిన మీపైన వినియోగదారుల ఫోరమ్ లో ఫిర్యాదుదారుడు / కంప్లైనేంట్ అనువారు మీపైన పైకేసు దాఖలు చేసి ఉన్నారు. పై కేసునందు కోర్ట్ వారు రెస్పాండెంట్/ ఆపోజిట్ పార్టీ అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా ఉన్నారు. కావున పై కేసు నందు మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల పై కోర్టునందు తేదీన ఉదయం 14-8-2025 10:30 గంటలకు మీరుగాని మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొనవలెను లేని ఎడల మీయందు పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తురుల మేరకు)

వాయిదా తేదీ. 14-8-2025

ఇట్లు
సయ్యద్ అమీర్ బాషా
M. దౌలత్
రెస్పాండెంట్/ ఆపోజిట్ పార్టీ పరం అడ్వకేట్స్,
కర్నూలు

ప్రభుత్వాల వైఖరితో

పంటల బీమాపై నిరాసక్తత

- 1.89 లక్షల మంది రైతులకు 1,321 మంది మాత్రమే ప్రీమియం చెల్లింపు
- అన్నదాతకు భారంగా పిఎం ఫసల్ బీమా యోజన
- నేటితో పసుపు రైతులకు గడువు ముగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఓవైపు రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు...మరోవైపు వారిపై భారం వేసేందుకు వెనుకాడటం లేదు. రాష్ట్రంలో పండించే పలురకాల పంటలకు రైతుల నుంచే బీమా ప్రీమియం వసూలు చేయాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఓవైపు విత్తనాలు, ఎరువులు దొరక్క బహిరంగ మార్కెట్లో అదనపు ధరలకు కొంటున్న రైతులకు ప్రీమియం రూపంలో డబ్బులు చెల్లించాల్సి రావడం వారికి మరింత భారంగా మారింది గతంలో ప్రభుత్వాలు ఆయా పంటలకు ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఈ భారాన్ని రైతులపై వేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో కలిసి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వాతావరణ ఆధారిత పంటల పథకాలను అమలు చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్లో కష్ణా జిల్లాలో వరి, పసుపు పంటలకు బీమా పథకం అమలుకు ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి. ఇందుకోసం జిల్లాలో టాటా, ఏఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు బీమా అమలు ఏజెన్సీగా వ్యవహరించనున్నారు. ఒక్కో రైతు వరి పంటకు ఎకరాకు 2 శాతం బీమా ప్రీమియం చొప్పున రూ.830, హెక్టారుకు రూ.2,075, పసుపు పంటకు ఎకరాకు రూ.1100, హెక్టారుకు రూ.2750 బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించేందుకు వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు గడువు ఉండగా, పసుపు పంటకు గురువారంతో ప్రీమియం చెల్లింపు గడువు ముగుస్తుంది. ఓవైపు ఖరీఫ్ ఖర్చులతో సతమతం అవుతున్న రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గుదిబండలా మారిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారున. గతంలో ప్రభుత్వాలే ఈ కర్ష్, ఈక్రాప్ పేరుతో సాగు చేసిన పంటలను నమోదు చేసి బీమా ప్రీమియం డబ్బులు చెల్లించేవి. ప్రస్తుతం ప్రభుత్వాలు ఆ బాధ్యతల నుండి తప్పుకుని టాటా, ఏఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లకు అప్పగించి చేతులు దులుపుకున్నట్లు రైతులు విమర్శి స్తున్నారు.

కష్ణాజిల్లాలో 1,89,560 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 1,321 మంది మాత్రమే బీమా ప్రీమియం చెల్లించినట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. వీరిలో వరి రైతులు 1,241మంది కాగా, పసుపు రైతులు కేవలం 72 మంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వాలు మెలిక పెట్టాయి. బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న రైతులకు వారు కట్టాల్సిన ప్రీమియం డబ్బులు మినహాయించి మిగిలిన సొమ్మును రైతులకు ఇచ్చేలా ఆదేశాలిచ్చాయి. ఈవిధంగా రుణాలు తీసుకున్న వారి వద్ద నుండి ప్రీమియం చెల్లించిన వారే ఎక్కువగా ఉన్నారు. వరికి సంబంధించి 1249 మంది రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం నగదు చెల్లిస్తే, వీరిలో 1221 మంది రైతులు బ్యాంకులనుండి రుణాలు తీసుకున్నారే ఉన్నారు. కేవలం 28 మంది రైతులు మాత్రమే సొంతంగా బీమా ప్రీమియం చెల్లించారు. అలాగే పసుపు రైతులకు సంబంధించి 72 మంది ప్రీమియం చెల్లించగా, వీరిలో బ్యాంక్ రుణాలు తీసుకున్న వారు 33 మంది ఉండగా, బ్యాంక్ రుణాలు తీసుకోని వారు 39 మంది మాత్రమే ప్రీమియం నగదు రూపంలో చెల్లించారు. మొత్తం జిల్లాలో 2500 హెక్టార్లలో సుమారు 4500 మంది రైతులు పసుపు పంట సాగు చేస్తున్నారు. అయితే వీరిలో కేవలం 72 మంది మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లా రైతాంగంపై సుమారు రూ.30 కోట్ల భారం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో వరి వంట సాగు, 5 వేల ఎకరాల్లో పసుపు సాగుకు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకుగాను బీమా ప్రీమియం కింద రెండు శాతం చొప్పున రైతులు బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దీనివల్ల జిల్లా రైతాంగంపై సుమారు రూ.25 కోట్లకుపైగా భారం పడనుంది.

బీమా కంపెనీల లబ్ధి కోసమేనా?

ప్రభుత్వాలు రైతుల తరుపున ప్రీమియం చెల్లించే బాధ్యత నుంచి తప్పుకుని బీమా కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు చెల్లిస్తున్న ప్రీమియం డబ్బంతా కంపెనీలకే చేరుతుంది. తుపాన్లు, వరదలు సంభవించే సమయంలో ఏదో కొద్దిమంది రైతులకు బీమా డబ్బులు చెల్లించి చేతులు దులుపుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. విపత్తులు లేకపోతే ఒక్కపైసా కూడా రైతులకు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈవిధంగా ప్రభుత్వాలు బీమా కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే రైతులపై భారాలు మోపుతున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తొయ్యర బండి హైలెస్సా...!!

ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవి శివారు శ్రీబాషితా పబ్లిక్ స్కూల్ వద్ద రోడ్డుపై బస్సు ఒక్కసారిగా నిలిచిపోయింది. మచిలీపట్నం నుండి అవనిగడ్డ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మోపిదేవి సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆగిపోయింది. సెల్ఫ్ స్టార్ట్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సు దిగి తొయ్యవలసిన పరిస్థితి ఎదురైంది. ఆర్టీసీ బస్సులు ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయి తెలియని పరిస్థితి నెలకొంది.

ఎస్‌టిల ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన కుటుంబాలకు నూటికి నూరు శాతం ఆధార్ నమోదు కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో కొంతమంది గిరిజనులకు ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేక ఇబ్బంది పడుతున్న దష్ట్యా వారికి ప్రత్యేకంగా ఆధార్ నమోదు చేపట్టాలని డిటి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటికి సూచించామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి మాట్లాడుతూ కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని, తహసీల్దార్లు, మండల అభివద్ధి అధికారుల సహకారంతో గిరిజనులకు నూరు శాతం ఆధార్ కార్డులు పొందే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ చంద్రశేఖర్, పాడ్యమి ఐటీ సొల్యూషన్స్ ప్రతినిధులు, నవజీవన్ బాల భవన్ ట్రస్ట్ వాలంటీర్లు పాల్గొన్నారు.

5న ధర్నాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : పూరిగుడిసెలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వై నరసింహారావు ఖండించారు. బుధవారం గుడివాడ పట్టణం ఎన్టీఆర్ కాలనీలోని స్మశానం రోడ్లో డోర్ నెంబరు 8-306లో ఒక పల్లెకారుడు నివాసముంటున్న ఓ పూరి గుడిశెకి స్మార్ట్ మీటర్‌ను బిగించారు. ఈ సందర్భంగా నరశింహారావు మాట్లాడుతూ ఇంటికి గోడలు కూడా లేక పరదాలతో ఇల్లు నిర్మించుకుని అనేక సంవత్సరాలు నుంచి కొడుకు తల్లి నివాసం ఉంటున్నారన్నారు. అలాంటి వారికి కూడా స్మార్ట్ మీటర్‌లు బిగించడం ఇంతకంటే సిగ్గుచేటు మరొక విషయం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి పవన్, గుడివాడ సిఐటియు నాయకులు ఆర్ సి పి రెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రజలను నిలువు దోపిడీ చేయడానికే నని మోపిదేవి మండలం సిఐటియు కార్యదర్శి సిహెచ్ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రజలను కలిసి స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని అలాగే ఆగస్టు ఐదున జరిగే మహా ధర్నాలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చి మోపిదేవి సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేసి సంతకాలు సేకరిం చారు. పోతర్లంక కుమార్ స్వామి, బెల్లంకొండ గులాబి, నందిగం సుబ్బారావు, కోలుసు లక్ష్మయ్య, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో విద్యుత్ ఛార్జీలు బారాలు తగ్గించాలని,, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కోరుతూ ఇంటింటికి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అలాగే ఆగస్టు 5వ తేదీన మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు మద్దుల బసవరావు, కౌలు రైతు సంఘం నాయకులు ఉప్పలపు వెంకటాద్రి, చిన్నం వెంకటేశ్వ రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు , టైలరు యూనియన్ నాయకులు రషీద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని చల్లపల్లి మండల సిఐటియు కన్వీనర్ మహబాద్ కరీముల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం చల్లపల్లిలో రైతు నాయకులు నంద్యాల ప్రభుతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఆదాన్ని స్మార్ట్ మీటర్లు ఆపాలని, బిగించిన మీటర్లను వెంటనే వెంటనే తొలగించాలని, ట్రూ అప్, ఇందన చార్జీల విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు చేశారు. **ప్రజాశక్తి-గన్నవరం :** ప్రజలు పోరాడితే పోయేది స్మార్ట్ మీటర్ మాత్రమేనని ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మోహన్‌రావు అన్నారు. బుధవారం గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ చేశారు. గ్రామ రాళ్లకట్ట సెంటర్లో ప్రజలను కలుసుకొని స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. చాగంటి పాటి వెంకటేశ్వరరావు, రమేష్, సోమిశెట్టి శ్రీనివాసరావు, బెజవాడ తాతబ్బాయి పాల్గొన్నారు.

గుడివాడలో...

మొవ్వలో...

చోరీ కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-కంకిపాడు : దొంగతనం కేసులో ఓ వ్యక్తికి రెండు సంవత్సరాల కఠిన శిక్ష, పది వేల రూపాయల జరిమానాను కోర్టు విధించింది. వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన మొరం నాగ దుర్గారావు 2021వ సంవత్సరం మార్చిలో ఓ ఇంటిలో దొంగతనం చేయగా అప్పటి పోలీసులు కోర్టులు హాజరుపర్చారు. ఈ కేసులో న్యాయ స్థానం ఎనిమిది మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించింది.

ఎరువుల షాపులు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం వ్యవసాయ అధికారిణి కవిత, సహయ అధికారిణి అనంతలక్ష్మీలు పట్టణం, రూరల్ మండంలోని ఎరువుల షాపులను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల డీలర్‌లు యూరియాకి ఎటువంటి లింక్‌లు పెట్టకుండా రైతులకు అందజేయాలన్నారు.

నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నాగేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కంకిపాడు : ప్రముఖ కవి,రచయిత, రైతు నాయకుడు వడ్లమూడి నాగేశ్వరావు 101వ జయంతిని యనమలకుదురు బాలోత్సవ ట్యూషన్ సెంటర్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజానాట్యమండలి, ఎస్వీ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీ డాన్స్ అకాడమీ డాన్స్ టీచర్ వడ్లమూడి నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వడ్లమూడి నాగేశ్వరరావు కుమార్తె వడ్లమూడి పద్మ ఆయన రాసిన పాటలను, కవిత్వాన్ని, రైతులకు ఆయన చేసిన సేవలను సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కష్ణా జిల్లా కార్యదర్శి షేక్ ఖాసిం, మహిళా సంఘం కార్యదర్శి షేక్ వలీబి, నాగూర్ బి ట్యూషన్ సెంటం లో ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు, ప్రజానాట్యమండలి కార్యకర్తలు పాల్గొన్నారు

6న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆగస్టు ఆరవ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల నైపుణ్య అభివద్ధి సంస్థ ప్రతినిధులు పద్వీజ ప్రశాంత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, సీనియర్ నాయకులు మత్తి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ అన్నపురెడ్డి, వెంకటస్వామి, బండే రాఘవ పాల్గొన్నారు

ల్యాబ్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకేషనల్ ల్యాబ్ ను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సుల నిర్వహణ తీరును పరిశీలించడానికి బుధవారం అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కొమ్ముదిని సింగ్, గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి సీతామహాలక్ష్మి పాఠశాలకు విచ్చేసి తనిఖీ నిర్వహించారు. ల్యాబ్ లో వస్తువుల పనితీరు ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్స్ యొక్క జాబ్ చార్టర్ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ వత్తి విద్యా కోర్సుల వల్ల జీవితంలో మెరుగైన జీవన విధానానికి బాట వేసినట్లు అవుతుందని తెలిపారు. ఈ తనిఖీలు పాఠశాల వోకేషనల్ కోర్స్ ఇన్స్ట్రక్టర్లు సౌజన్య రామయ్య పాల్గొన్నారు. పాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం పుష్ప కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు.

మట్టి మనిషి నాటిక బ్రోచర్ ఆవిష్కరణ

విజయవాడ : ప్రముఖ రచయిత వాసిరెడ్డి సీతాదేవి చారిత్రక రచన 'మట్టి మనిషి'ని నాటికగా రూపొందించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శింపబడి ప్రజాదరణ పొందిందని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తెలిపారు. మూడు గంటల పాటు నడిచే ఈ మట్టి మనిషి నాటికను ఆగస్టు 2,3 తేదీల్లో విజయవాడ నగరంలో ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో అభ్యుదయ రచయితల సంఘం, జాషువా సాంస్కృతిక వేదిక, అరవింద ఆర్ట్స్ అకాడెమీ, కృష్ణవేణి క్రియేషన్స్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఫొటో ఇండియా, కామ్రేడ్ జిఆర్‌కె పోలవరపు సాంస్కృతిక వేదిక నేతృత్వంలో ఇతర సాహిత్య, సాంస్కృతిక సంఘాల నిర్వహణలో ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఈ మేరకు బుధవారం బాలోత్సవ్ భవనంలో పాత్రికేయ మిత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. నాటిక ప్రవేశ టిక్కెట్ రుసుము రూ.100, ప్రత్యేక టిక్కెట్ రుసుము రూ.500 అని తెలిపారు.

సమ్మెకాలపు వేతనాలు అమలుకు ఆందోళనకు : సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సమ్మె కాలపు వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఆగస్టులో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని సిపిఎం నేత బి.సత్యబాబు పిలుపునిచ్చారు. బుధవారం 38వ డివిజన్ శానిటేషన్ కార్మికుల గేట్ సమావేశం మల్లికార్జున్ పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సర్కిల్ వన్ కార్యదర్శి వి.సాములు,గౌరవ అధ్యక్షులు బి.సత్యబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ దేశవ్యాప్త పోటీల్లో ర్యాంకులు సాధిస్తున్న కీలకమైన కార్మికులకు సంక్షేమ పథకాలు కోతల కోసి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేస్తూ కాంట్రాక్ట్ ఇచ్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పనిగంటలను హరించి వేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం లక్ష్మి. చంద్ర. శశికళ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యబాబు

రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నాగసాయి నగర్ బైపాస్ రోడ్డు వద్ద డ్రైనేజీ పూడుకు పోవడంతో వర్షం వస్తే వరదతో ఇల్లు ముంపుకు గురవుతున్నాయని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనకు బుధవారం హైకోర్టు లాయర్ బోడపాటి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నాగసాయి నగర్‌లో వర్షాకాలం వచ్చిన ప్రతిసారి ఇళ్లల్లో నీరు ప్రవేశించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొండపై నుండి వచ్చే వర్షం నీరు ఇందిరానగర్ పక్కన ఉన్న పురావస్తు కట్ట ద్వారా నాగ సాయి నగర్ వద్దకు రావడం జరుగుతుందని, నీరు సహజ సిద్ధంగా హైవే డ్రైనేజ్ ద్వారా వెళ్లాల్సినప్పటికీ కొందరు అక్రమంగా మార్గాన్ని మూసి వేయడంతో ముంపుకు గురవుతుందని కమిషనర్ల తెలిపారు. నాగ సాయి నగర్ సందర్శించిన మున్సిపల్ కమిషనర్ నాగసాయి వాసుల వినతిపత్రాన్ని అందుకున్న కమిషనర్ వెంటనే స్పందించి నాగసాయి నగర్ వద్ద పూడుకుపోయిన డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీని శుభ్రం చేసి వర్షపు నీరు వెళ్లేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాళ్లు దెబ్బతిని అంగ వికలాంగుడిగా ఉండి నడవలేని పరిస్థితుల్లో ఉన్న 27వ డివిజన్ బావాజీ పేటకు చెందిన శ్రీనివాస్ రావుకు బ్యాటరీ ట్రై సైకిల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తన సొంత నిధులతో బుధవారం అందజేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రజలకు భారంగా మారిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని అవసరం లేకపోయినా బలవంతంగా బిగుస్తున్న స్మార్ట్ మీటర్లు ఆపాలని కోరుతూ బుధవారం 50 డివిజన్ క్వారీ ప్రాంతంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు పెంచననిమాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రజలపై భారాలను మో పుతూ వెన్నుపోటు పొడవడం అన్యాయం అని ధ్వజమెత్తారు. ప్రజాసంఘాల ప్రజావేదిక పిలుపుమేరకు ఆగస్టు 5న సంతకాల సేకరణతోపాటు స్థానిక సచివాలయాల సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **వత్సవాయి :** స్మార్ట్ మీటర్లు ఇళ్ళకు బిగించవద్దని ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు సి హెచ్.హనుమంతరావు, బి.రాములు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని మండల కేంద్రంలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సి. హెచ్.హనుమంతరావు, బి.రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు బి.పుల్లయ, వై.వెంకటరత్నం, కేశకు, పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని కోరుతూ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోటా కష్ణ, షేక్ గౌస్ మియా, రావెళ్ళ శేషు, వివి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **ఎ.కొండూరు :** స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చీమలపాడు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు మాట్లాడారు.

విజయవాడలో ఆందోళన చేస్తున్న దృశ్యం

కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లొద్దు: తహశీల్దార్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :

ప్రకాశం బ్యారేజీ వద్ద క్రమంగా పెరుగుతున్న వరద పెరుగుతున్న నేపథ్యంలో విజయవాడ పశ్చిమ తహసిల్దార్ ఇంతియాజ్ పాషా సిబ్బందితో పాటు కరకట్ట ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టు నుండి ప్రకాశం బ్యారేజీకి 65,000 క్యూసెక్కుల వరద నీరు విడుదల అయినా నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి మూడు లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు పెరిగే అవకాశం ఉందంటున్న ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పశ్చిమ తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి తహశీల్దార్ ఇంతియాజ్ పాషా భవానీపురం విద్యాధరపురం కరకట్ట ప్రాంతాలను నిరంతర పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా కరకట్ట ప్రాంతాల్లో ఇసుక బస్తాలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేలా స్థానికంగా ఏర్పాట్లు చేశారు. భారీగా వరద నీరు చేరుతున్న క్రమంలో నదిలోకి మత్స్యకారులు సామాన్య ప్రజలు ఎవ్వరు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. మత్స్యకారులు నాయకులతో వారి కుటుంబాలతో చేపలవేటకు నదిలోకి పోవద్దని తహశీల్దార్ మీటింగు ఏర్పాటు చేశారు. కృష్ణా నది పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో కంచికచర్ల ఎస్ఐ బి.రాజు ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను, వాహనాలకు సరైన పేపర్లో లేని వాటిని, పరిమితికి మించి ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హెల్మెట్లు, సరైన పేపర్లు, పరిమితికి మించి వెళ్తున్న వాహనదారులను పట్టుకొని వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. సదరు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు వేగంగా వెళ్లకూడదని, అన్ని నిబంధనల ప్రకారం పేపర్‌లుంటే ప్రయాణించాలని కోరారు. భారీ ఎత్తున చలానాలను రాశారు. పోలీసుల తనిఖీలతో వాహనదారులు బెంబేలెత్తారు.

ఆధార్ సెంటర్లను పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి - తిరువూరు : సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను తక్షణమే పునర్ధించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు కార్యకర్తలు బుధవారం తిరువూరు పట్టణంలో జన్మ భూమి రోడ్డులో గల ఐదవ సచివాలయం ముందు ధర్నా చేశారు. 2, 5 సచివాలయాల్లో ఆధార్ సెంటర్లలో సర్వీస్‌లు నిలిపివేయటం వల్ల ప్రభుత్వ పథకాలన్నిటికీ అవసరమైన ఆధార్ డేటా కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.వి.భద్రం తెలిపారు. తక్షణమే ఆధార్ సెంటర్‌ను ప్రారంభించాలన్నారు. పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడానికి ఆధార్ లేకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆధార్ కోసం తెలంగాణ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణ జనాభాకు అనుగుణంగా 6 సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఉండాల్సింది కేవలం రెండు సెంటర్లు మాత్రమే ఆధార కేంద్రాలున్నప్పటికీ సుమారు గత నెల రోజుల నుండి పనిచేయకపోవడం వల్ల తిరువూరు పట్టణ, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భద్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆకుల రవి, బి.వెంకటేశ్వరావు, కూరపాటి వెంకటరత్నం, మరకాల ప్రకాశరావు, షేక్ నాగుల్ మీరా, బి.మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భూ బాధితులకు అండగా ఉంటాం : మాజీ ఎమ్మెల్యే జలీల్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ :

పశ్చిమలోని జోజినగర్, ఆర్టీసీ సుబ్బారావు ప్లాట్ల యజమానులు అధైర్యపడోద్దని, వారికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎంఎల్ఎ జలీల్ ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు మైలవరపు కష్ణ, కూటమి నేతలతో కలిసి 45 వ డివిజన్ జోజి నగర్ లోని 42 ప్లాట్ల బాధితులకు సంఘీభావం తెలిపి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. జలీల్ ఖాన్ మాట్లాడుతూ గతంలో విశాఖ ,హైదరాబాదు లాంటి నగరాలలో పేదలను మోసం చేసే సంస్కృతి ఉండేదని అలాంటి నీచ సంస్కృతి విజయవాడ నగరంలో కూడా మొదలైందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు చెమటోడ్చి ప్లాట్లు కొనుగోలు చేసుకుని, ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటుంటే, కొంతమంది వ్యక్తులు రాజకీయం ముసుగులో పేదల ఆస్తిని దక్కించుకోవాలని అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. 42 కుటుంబాలు 300 మంది పేద ,మధ్య తరగతి ప్రజలు గత 28 రోజులుగా తమకు దక్కవలసిన ప్లాట్ల కోసం న్యాయపరంగా ఆందోళన చేస్తున్నారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని భరోసానిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం ముచ్చినపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్. కీర్తి రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ముచ్చినపల్లి, శ్రీరాంపురం గ్రామాల్లో ఆశావర్కర్లు, ఆరోగ్యకార్యకర్తలు ఇంటింటికి తిరిగి దోమలు వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. ముచ్చినపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి యాంటీ లార్వా కార్యక్రమం చేపట్టారు. మిగిలిన అన్ని గ్రామాల్లో వైద్య శిబిరం ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలూ, ఆశ కార్యకర్తల సహాయంతో దోమ లార్వాని గుర్తించడం, పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలని, అనారోగ్యంతో ఉన్నవారికి, మందులు అందజేస్తున్నారు.

రామచంద్రరాజు వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : నీతి, నిజాయితీలకు నిలువుటద్దం కమ్యూనిస్టుల ఘనాపాటి ఉప్పలపాటి రామచంద్రరాజు అని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఉప్పలపాటి ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రామచంద్రరాజు 22వ వర్ధంతి కార్యక్రమాన్ని వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉప్పలపాటి చిత్రపటానికి జి.కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళు అర్పించారు. కార్యక్రమంలో నగర పార్టీ సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర పార్టీ కార్యాదర్శివర్గ సభ్యులు కొట్టు రమణారావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య పాల్గొన్నారు.

రొయ్యల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రొయ్యల సాగు చేసే రైతులకు శాస్త్రీయ సమాచారాన్ని చేరవేసే లక్ష్యంతో ది వాటర్‌బేస్ లిమిటెడ్ సంస్థ నగరంలో ఘనంగా ఆక్వా మీట్‌ను నిర్వహించింది. వర్షాకాలంలో కనిపించే వాతావరణ మార్పులు, నీటి నాణ్యతలో గల హెచ్చుతగ్గులు, వ్యాధుల ప్రమాదం వంటి అంశాలపై రైతులు అప్రమత్తంగా ఉండేలా చేయడం ఈ ఆక్వామీట్ ప్రధాన ఉద్దేశ్యం అని ది వాటర్‌బేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శక్తి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాల సవాళ్లను తట్టుకునేందుకు అనుసరించ వలసిన మంచి యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఆక్సిజన్ స్థాయి నిర్వహణ, వర్షం సమయంలో ఫీడ్ మోతాదును సరిచేసుకుంటూ డిమాండ్ ఫీడింగ్ ఇవ్వడం ద్వారా చెరువు అడుగు భాగం శుభ్రంగా ఉంచడం, అనుమతి లేని రసాయనాల వినియోగం నివారించటం వంటి కీలక అంశాలను వివరించారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - చందర్లపాడు : నందిగామ డివిజన్‌లో నందిగామ, చందర్లపాడు మండలాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ విఎఎలకు నందిగామ మండలం పెద్దవరం గ్రామం చెరుకుంపాలెం గ్రామాల్లో జరిగిన ఫీల్డ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఎటిఎమ్ మోడల్ ఏ విధంగా వేసుకోవాలి ఈ ఎటిఎమ్ మోడల్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి అనే విషయాల మీద లైవ్‌లో ఎన్‌ఎఫ్ఎ అంజిరెడ్డి, డిఎంఎంటి బెంజిమెన్ శిక్షణ ఇచ్చారు. తర్వాత మధ్యాహ్నం నుండి బీజామృతం ఏ విధంగా తయారు చేయాలి, ఘనజీవామృతం ద్రవ జీవామృతం సీడ్ బాల్స్ ఏ విధంగా తయారు చేయాలి వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి అని లైవ్‌లో డెమో చూపిస్తూ ఎన్‌ఎఫ్ఎ అంజిరెడ్డి డిఎంఎంటి బెంజిమెన్ శ్రీనివాస్ నాయక్ మండల యాంకర్ సుధాకర్ విఎఎలకు పూర్తిస్థాయిలో లైవ్‌లో చూపిస్తూ శిక్షణ ఇచ్చారు.

ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి

మాట్లాడుతున్న కె. ధనలక్ష్మి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన లిఖితపూర్వక హామీలు వెంటనే అమలు చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో కృష్ణాజిల్లా ఆశా వర్కర్ల ఆరో మహాసభ జరిగింది. ఈ సభకు జిల్లా ప్రధాన కార్యదర్శి పర్చూరు ధనశ్రీ అధ్యక్షత వహించగా ధనలక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 25 మండలాలలో 1400 మంది ఆశా వర్కర్లు పనిచేస్తుండగా మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలకే కాకుండా ఇతర పనులకు కూడా వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఆశ వర్కర్లకు సంబంధం లేని పని చెప్పడం కాకుండా ఏ పని చెప్పినా చేయాలని లేకపోతే జీతాలు రావాలని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సబ్ సెంటర్లకు రావాలని గ్రామ వార్డు సచివాలయంలో అందుబాటులో ఉండాలని ఒత్తిడి చేయడం పట్ల ఆశా వర్కర్ల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్సీడీ సిడి సర్వేలు టీవీ కళ్ళు పరీక్షలు చేయించాలని, వ్యాక్సిన్ క్యారియర్లు రవాణా చేయాలని, సబ్ సెంటర్ క్లీనింగ్ చేయించడం, మురుగు కాల్వల వల్ల దోమల నివారణకు మందులు చెల్లించే బాధ్యతలు కూడా ఆశాలకు అప్పజెప్పడం చూస్తే ఇన్ని పనులు ఒక ఆశా కార్యకర్త చేయగలదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆశా వర్కర్ల్శు కురిపించిన వరాల జల్లుకు అనుగుణంగా జీవో విడుదల ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతాను అన్న హామీ తో పాటు ఆశ వర్కర్లకు ఇస్తానన్న గ్రాట్యుటీ కీ సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కోశాధికారి అగ్నిపర్తి కమల మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి ఆశ వర్కర్ల సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : కృష్ణాజిల్లా ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలుగా గుర్రం చిట్టి కుమారి, ప్రధాన కార్యదర్శిగా పరుచూరి ధనశ్రీ, సహాయ కార్యదర్శిగా వల్లూరు స్వరూప, ఉపాధ్యక్షురాలుగా కనుకుర్తిపూడి చందన లక్ష్మి, కోశాధికారిగా వి కిరణ్మయి ఎన్నికయ్యారు. వీరితోపాటు జిల్లా కమిటీ సభ్యులుగా వివిధ మండలాల నుంచి 18 మంది ఆఫీస్ బేరర్లుగా 9 మంది యూనియన్ కార్యకలాపాలకు సేవలందించనున్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారిణి అభినందిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళకు బంగారు పతకం

ప్రజాశక్తి - గుడివాడ : జాతీయస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం లిఫ్టర్ చంద్రకళ గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గోల్డ్ మెడల్ సాధించిన చంద్రకళను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్ణాటకలో జరిగిన నేషనల్ సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారిణి సిరా చంద్రకళ 75 కేజీల విభాగంలో 215 కేజీల బరువును ఎత్తి గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటిందన్నారు. క్రీడాకారులను తయారుచేసే ఘనత రూపాంతరం చెందిన ఎన్టీఆర్ స్టేడియం ప్రతిభగల క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ, ప్రత్యేక స్పోర్ట్స్ క్యాలెండర్ రూపొందించి క్రీడాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కోచ్ వెంకటేశ్వరరావు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల పరిషత్ కార్యాల యంలో స్వమిత్వ లో భాగంగా రెండవ ఫేస్‌లో ఎంపికైన అంగలూరు, వడ్లమన్నాడు, పురిటిపాడు, పోలిమెట్ల, శేరీదగ్గుమిల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు టుటాల చేత ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో ఎజెఎల్ నరసింహారావు అధ్యక్షతన ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వమిత్వ అనేది గ్రామకంఠం భూములలో ఎటువంటి యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు లేకుండా నివసించే వారికి అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే కార్యక్రమం అని ఎంపిడిఓ అన్నారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తా మన్నారు.

వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి : ఇన్చార్జి కలెక్టర్

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ప్రకాశం బ్యారేజీలో వరద నీటి ప్రవాహం రాను రాను పెరుగుతున్న దృష్ట్యా అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. బుధవారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి క్షేత్రాధికారులతో వరదలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లా డుతూ ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కుల వరద నీటి వివాహం వచ్చే అవకాశం ఉందని, 2 అడుగుల మేరకు అన్ని గేట్లను ఎత్తివేసి వరద నీటిని కిందకు వదిలారని, ఆ నీరు పూర్తి ఒరవడితో దిగువన ఉన్న కృష్ణాజిల్లాలోకి వస్తోందన్నారు. క్షేత్రాధికారు లందరూ వారి ప్రధాన కేంద్రాల్లో అందుబాటులో ఉండి వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించా లన్నారు. సిబ్బందికి ఎవరికైనా సెలవులు ఇచ్చి ఉంటే వాటిని వెంటనే రద్దుచేసి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులు కాలువల వద్ద గట్టి నిఘా ఉంచి వరదనీటి స్థాయిని ఎప్పటికప్పుడు గమనించుకోవాలన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో అన్ని గ్రామాల్లో దండోరా వేయించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో వెంటనే ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసి తగిన చర్యలు తీసుకునే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

నీటి మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు ప్రభుత్వ హాస్పిటల్‌లో చెడిపోయిన నీటి మోటారును బాగు చేయించినట్లు సిహెచ్‌సి చైర్ పర్సన్ శ్రీమతి బోయిన రోహిణి కుమారి, కంకిపాడు జనసేన గ్రామ అధ్యక్షుడు బోయిన నాగరాజులు తెలిపారు. హాస్పటల్ కి వచ్చిన పేషెంట్లు అసౌకర్యానికి గురికాకూడదనే ఉద్దేశంతో తన సొంత డబ్బులతో వాటర్ ట్యాంకులతో నీరు తెప్పించినట్లు వివరించారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

● ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కృతిక శుక్లా

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కృతికాశుక్లా

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్న వరం) : బాపులపాడు గ్రామం లోని జిల్లా పరిషత్ హైస్కూల్, అందులో నడుస్తున్న బాలికల ఇంటర్ కళాశాలను ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కృతిక శుక్లా పరిశీలించారు. బాలికలతో కాసేపు మాట్లా డారు. తగినంతమంది అధ్యాపకులు లేరని, అదేవిధంగా యూనిఫాం ఇవ్వడం లేదని, ల్యాబ్ సదుపాయం లేదని బాలికలు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడతామని చెప్పారు. బాగా చదువుకుని మంచి ర్యాంకులు సాధించాలని ఆమె సూచించారు. ఆ తర్వాత హైస్కూల్ లోని బాలబాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తర్వాత వీరవల్లి హై స్కూల్ ను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల సంఖ్యను, ఆరవ తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య వివరాలను హెచ్ఎం శ్రీనివాసరావును అడిగారు. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ వి. విజయరామరాజు , డీఈఓ రామారావు, డిప్యూటీఈఓ కొండా రవి, బాపులపాడు ఎంఈఓ రామ్ బాల సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు, ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో అనుబంధ కళాశాలలకు సంబంధించి యూ జి ఐదవ మరియు ఆరవ సెమిస్టర్ స్పెషల్ సప్లమెంటరీ ఫలితాలను బుధ వారం విశ్వవి ద్యాలయ ఉపకు లపతి ఆచార్య కె రాంజీ విడుదల చేశారని పరీక్షల నియంత్ర ణాధికారి డా.పి వీర బ్రహ్మచారి తెలిపారు. 1366 మంది విద్యార్థులు 2333 పేపర్స్ రాయగా 1178 పేపర్స్ ఉత్తీర్ణత సాధించా రన్నారు. ఉత్తీర్ణత శాతం 50.49 శాతం అని బ్రహ్మచారి తెలిపారు.ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎం వి బసవేశ్వరరావు, పరీక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1 నుండి నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో బియ్యం కార్డుదారులకు ఆగష్టు నెలకు సంబంధించి ప్రజా పంపిణీ విధానము ద్వారా ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చౌక ధరల దుకాణముల వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జి.మోహన్ బాబు తెలిపారు. కాబట్టి వినియోగదారులందరూ ప్రభుత్వం సబ్సిడీ పై అందించే నిత్యావసర వస్తువులు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆగష్టు నెలకు గాను 65 సంవత్సరాలు పై బడిన వయోవృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటివద్దనే ఇప్పటి వరకు 42072 మందికి నిత్యావసర సరుకులు అందిస్తారన్నారు.

కెయుతో మార్పు ట్రస్ట్ ఎంఒయు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మహిళల అక్రమ రవాణాతో పాటు పలు సామాజిక అంశాల గురించి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించే లక్ష్యంతో కృష్ణా విశ్వవిద్యాలయం, విజయ వాడకు చెందిన మార్పు ట్రస్ట్ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాంజీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, మార్పు ట్రస్ట్ నిర్వాహకురాలు సూఈజ్ ఎంఒయూపై సంతకాలు చేశారు. మహిళల భద్రత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మత్తు పదార్థాలు వాడకం వల్ల జరిగే అనర్థాలు పై అవగాహన కల్పించడం తదితర అంశాలపై ఇరువురు కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు పాల్గొన్నారు.

4 నుంచి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు ఆగస్టు 4వ తేదీ నుండి ఏడాది పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలో కూడా విస్తృతస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు నాలుగో తేదీ ఉదయం గాంధీ క్షేత్రంలో శతజయంతి వేడుకలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. విజయవాడ హైదరాబాద్ సహా ఇంకా అనేక మహోన్నత వేదికలపై మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నున్న సుబ్బారావు, చిలకా శ్రీనుబాబు, గాజుల పోతరాజు సిద్ధం చేసిన శతజయంతి వేడుకల స్టిక్కర్లను ఆవిష్కరించి కూటమి నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు

శత జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం కే. కొత్తపాలెం పాగోలు వెళ్లే 8వ నెంబర్ పంట కాలవ సమీపంలోని రాజాగారి భూములకు వెళ్లే పంటబోదును సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, పంచాయతీ కార్యదర్శి రైతుల సహకా రంతో పూడికతీత తీయించారు. బుధవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి రైతుల సమ క్షంలో జెసిబిని ఏర్పాటు చేసి పంటబోదును పూడికతీత తీయించారు. ఈ సందర్భంగా ఈ పంటబోదు కింద సాగు చేస్తున్న 200 మంది రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, బుర్రె వెంకటేశ్వరరావు, చందన అనిల్, దుట్టా శేషుబాబు పాల్గొన్నారు.

212 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గన్నవరం : విద్యార్థులకు చిన్ననాటి నుండి ఆరోగ్యం పై అవగాహన అవసరమని డాక్టర్ పవన్ సీతారాం అన్నారు. బుధవారం రేమల్లెలోని విజ్ఞాన్ స్కూల్లో లయన్స్ క్లబ్ హనుమాన్ జంక్షన్ ఆధ్వర్యంలో మెడ్వాల్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పవన్ సీతారాం (చిన్నపిల్లల వైద్యులు), డాక్టర్ వినీల, డాక్టర్ స్పందన, డాక్టర్ హర్ష 212మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చాక్లెట్లు లాంటి జంక్ ఫుడ్డను దూరంగా ఉంచాలని, పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దఢత్వం పెరుగుతుందని విద్యార్థులకు సూచించారు. కరస్పాండెంట్ పూర్ణచంద్రరావు, క్లబ్ కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒ చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల పరిధిలోని కొనకంచి క్రాస్‌రోడ్‌లో గల పారామౌంట్ కంపెనీ విస్తరణ పనులపై ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తించిన తీరును ఖండించిన ఇండస్ట్రీలిస్ట్ సురేష్ కుమార్ ప్రకటనపై ఆర్డీవో బాలకృష్ణ స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య సత్వరమే స్పందించారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌కి ప్రభుత్వం వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా వారు తెలిపారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించి పనులను ప్రారంభించుకునే విధంగా కార్యాచరణ చేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్‌కు సహకరిస్తే ముందు ముందు రోజులలో మరెన్నో సేవ కార్యక్రమాలు, యువతకు ఉద్యోగాలు, నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కంపెనీలను హైదరాబాద్‌కు తరలిస్తామని తాను చేసిన ప్రకటనను విరమించు కుంటున్నట్లు తెలిపారు. కంపెనీలు యధావిధిగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని కొనసాగుతాయని సురేష్ పేర్కొన్నారు.

పిఎసిఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలందించాలని మైలవరం ఎంఎల్‌ఎ వసంత వెంకట కృష్ణప్రసాద సూచించారు. రెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం రెడ్డిగూడెంలో బుధవారం జరిగింది. చైర్మన్‌గా ఉయ్యూరు సుబ్బారెడ్డి (టీడీపీ), సభ్యులుగా చేవేలమడుగు కాంతారావు (జనసేన), బలగాని గోపి (బీజేపీ) బాధ్యతలు స్వీకరించారు. త్రిసభ్య కమిటీని ఎంఎల్‌ఎ వసంత అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆరు గ్రామాల పరిధిలోని రైతులంతా ఈ సొసైటీలో సభ్యులైనందున అందరికీ తలలో నాలుకలా సేవలందించాలని నూతన కమిటీకి సూచించారు. రాజకీయాలకు అతీతంగా సొసైటీ సభ్యులకు రుణాలు, సకాలంలో అందజేయాలని సూచించారు. వారికి రాయితీపై ప్రభుత్వం నుంచి మంజూరు అయ్యే ఎరువులు, విత్తనాలు, ఇతరత్రా సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. అన్నదాతలకు ఎటువంటి సమస్యలున్నా తక్షణమే స్పందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి: డిపిఒ

ప్రజాశక్తి - వత్సవాయి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారి లావణ్య కుమారి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే 2025లో భాగంగా ముళ్లపాడు గ్రామంలోని పంచాయితీ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రములు, హెల్త్ సెంటర్లు పరిశీలించారు. వివరాల అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు గ్రామాల్లో చెత్త రహితంగా ఉండాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిలిపివేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి పొదపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఎంపీడీవో కార్యాలయం ఏవో దా రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో గుంటుపల్లి వాసు, కేంద్ర బంద సభ్యులు డి చందు, పంచాయతీ కార్యదర్శులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పరిశ్రమలు ఏర్పాటుచేసే యువతకు మంచి భవిష్యత్తు అందించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం పలు డివిజన్లకు చెందిన వారికి రూ. 53 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతి కుమార్ సొంత నిధుల నుంచి బాధిత కుటుంబాలకు అందజేశారు. 21వ డివిజన్‌కు చెందిన బత్తుల మంజులతకు కాలేజీ ఫీజు నిమిత్తం రూ.22 వేలు, పటమట 14వ డివిజన్ కు చెందిన పవన్ సాయికి కాలేజీ ఫీజు కోసం రూ.16 వేలు, 13వ డివిజన్‌కి చెందిన జగ్గారావు, 11వ డివిజన్ పటమట దానయ్య బజార్‌కి చెందిన లంకే గోవింద్, 5వ డివిజన్‌కు చెందిన కొమ్ము కమలమ్మ మృతిచెందగా కుటుంబ సభ్యులకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జాస్తి సాంబశివరావు, నందిపాటి దేవానంద్, దేవరపల్లి ఆంజనేయులు, షేక్ నాగూర్, తంగిరాల ఏసోబు, బూరగడ్డ వర ప్రసాద్, హనీఫ్ తదితరులు ఉన్నారు.

పి4 పథకానికి సహకరించండి : ఆర్‌డిఒ బాలకృష్ణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-ఫోర్ పథకానికి తమ వంతు సహకారం అందించాలని జగ్గయ్యపేట పాన్ బ్రోకర్స్‌ను నందిగామ ఆర్డీవో బాలకృష్ణ కోరారు. బుధవారం నందిగామ ఆర్డీవో కార్యాలయంలో జగ్గయ్యపేట పాన్ బ్రోకర్స్‌తో సమావేశం నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో నిరుపేద వర్గాలను దత్తత తీసుకుని వారి అభ్యున్నతికి తమ వంతు పాటు పడాలని కోరారు. వ్యాపారులు ఎన్నో రకాలుగా సేవలందిస్తారని, ఒక కుటుంబాన్ని ఉద్ధరించడం ద్వారా ఆ కుటుంబంలో వారికి ఎప్పటికీ గుర్తుండి పోతారని, సమాజానికి వేలు చేసిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో షరాబు వర్తక సంఘం ప్రతినిధులు చింతా శేషానందం, యర్రం శివ ప్రసాద్, జంగాల నాగరాజు, శ్రీరాం సీతారామమూర్తి, రంగాపురం శ్రీనివాసరావు, చౌడవరపు చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ సభ్యులు వెంకటేశ్వరరావు మృతి

పలువురు నేతల నివాళి

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 63వ డివిజన్, సుందరయ్యనగర్ రజక వీధిలో నివాసముంటున్న సిపిఎం సీనియర్ సభ్యులు పొనుగోటి వెంకటేశ్వరరావు (80) అనారోగ్యంతో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో మృతి చెందాడు. ఈయన మృతి పట్ల సిపిఎం నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపి, ఘన నివాళులర్పించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్రకమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నాయకులు కె.దుర్గారావు తదితర నాయకులు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి, ఆయన భౌతికకాయంపై పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. వెంకటేశ్వరరావు పుట్టి, పెరిగింది ప్రస్తుత 22వ డివిజన్ కృష్ణలంకలో అయినా, ఈ ప్రాంత నివాసులను తరలింపులో భాగంగా 1985-86లో 63వ డివిజన్ సుందరయ్యనగర్, రజకవీధిలో నివాసం ఏర్పాటు చేసుకొని ఉన్నారన్నారు. పాలఫ్యాక్టరీ ఎంప్లాయీస్ సమస్యలపై పోరాటం, రాజీవ్‌నగర్‌కు కృష్ణలంక వాసులను తరలింపు సమయంలో అర్హులకు ఇళ్ల మంజూరు చేయాలని

వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న బాబూరావు

ఆందోళన, పాయకాపురం ఇళ్ల పట్టాల సాధనకు చేసిన ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారన్నారు. వెంకటేశ్వరరావుకు నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు సిహెచ్.శ్రీనివాస్, బత్తుల చిన్నారావు, ఎస్‌కె పీరు సాహెబ్, కృష్ణమూర్తి, విజ్జి గురుమూర్తి, వెంకటరెడ్డి, వై సుబ్బారావు, ఎం బాబూరావు, ఎన్ శ్రీనివాసరావు, బొంగు రాంబాబు, పి.సాంబిరెడ్డి, రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు లింగాల నిర్మల, యు.లింగేశ్వరరావు తదితరులున్నారు. వెంకటేశ్వరరావు అత్యక్రియలు గురువారం కృష్ణలంక స్వర్గపురిలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌ఎస్‌కె సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా విజయవాడ సబ్ డివిజన్, ఇబ్రహీంపట్నం మండలం మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులకు గ్రామ ఉద్యానవన సహాయకులకు మల్టీపర్పస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్‌కు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 29 నుండి 31 వరకు ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ రైతు సేవా కేంద్రంలో మూడు రోజుల శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, డిపిఎం శంకర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని రైతులతో సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం 9 సార్వత్రిక

సూత్రాలు గురించి నేచురల్ ఫామింగ్ సిబ్బంది వివరించారు. పంట వైవిధ్య, ఆహార వైవిధ్యాన్ని పెంచి ఆరోగ్యకరమైన సంక్లిష్టమైన ఆహారాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్మెంట్ ఫార్మింగ్ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.

వొడాఫోన్ ఫైనాన్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అగ్రగామి టెలికం సంస్థ వి (వొడాఫోన్ ఐడియా) కొత్తగా వి ఫైనాన్స్ పేరిట ఒక సమగ్రమైన ప్లాట్‌ఫాంను తమ వి యాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది సంస్థ ప్రతినిధి కె.అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, క్రెడిట్ కార్డుల్లాంటి వాటిని కస్టమర్లకు సులభతరంగా అందుబాటులో ఉంచేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.. ఇప్పటికే యుటిలిటీ చెల్లింపులు, సినిమాలు, టీవీ షోలు, గేమింగ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్‌లో షాపింగ్ డిస్కౌంట్లతో పాటు మరెన్నో సర్వీసులు అందిస్తున్న వి యాప్‌లో ఇది సరికొత్తగా ప్రారంభించిందని అన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కళాకారులను గుర్తించి వారికి ప్రభుత్వ గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జివి రంగారెడ్డి అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో బుధవారం కళారంగ బాధ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి మాట్లాడుతూ అర్హులైన కళాకారులకు పెన్షన్లు, పరికరాలు, డ్రస్సులను ఇవ్వాలని, ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు రైళ్లలో రాయితీ కల్పించాలని, ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని, కళాకారుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో రాయితీలు కల్పించాలని, పురాతన కళలను గుర్తించి అంతరించిపోయే కళలను కాపాడాలని, ఆ కళలను ప్రస్తుత తరానికి అందించి వాటిని కాపాడాలని కోరారు. ఆగస్టు 23న అన్ని కళా రంగాలకు చెందిన అన్ని విభాగాల కళాకారులతో, కళాకారుల బాధ్యులతో సమావేశం నిర్వహించాలని, కళాకారులు ఐక్యంగా ఉద్యమించి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కళాకారులకు కళానాట్యమండలి సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు కె.శ్రీనివాసరావు, షేక్ గౌస్ మియా, కోట కృష్ణ, కె రవికుమార్, ఎస్ లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

బ్యారేజీకి వరద ఉధృతి

ఎత్తి లక్షా 4 వేల 750 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 1,21679 క్యూసెక్కులుగా ఉందని అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో మూడు లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం : కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

కృష్ణానదికి వరదల నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారానికి లక్ష క్యూసెక్కులు, రెండు రోజుల్లో మూడు లక్షల క్యూసెక్కులకు వరద పెరిగే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకుండా అవగాహన కల్పించామన్నారు. విజయవాడ ప్రాంతంలో దాదాపు 43 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, వీటిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలో పునరావాస కేంద్రాలతో మ్యాప్ చేశామని తెలిపారు. బుడమేరు, మునేరు, పులివాగు, కోతుల వాగు తదితర వాగుల విషయంలోనూ అప్రమత్తంగా ఉన్నామన్నారు. వరదలపై జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇది 24 గంటలూ పనిచేస్తుందని వెల్లడించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్‌ఈ ఆర్.మోహనరావు, ఈఈ ఆర్.రవికిరణ్, డీఈ ఎన్.అజయ్‌బాబు, బ్యారేజ్ జేఈ సత్య రాజేష్ తదితరులు ఉన్నారు.

పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో గల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కష్ణారావు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్ లు తుమ్మల ప్రభాకర్, పఠాన్ హాఫిజున్నిషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - వత్సవాయి : తాళం వేసి ఉన్న ఇంట్లో నగదు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు బాధితులు బుధవారం పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల కేంద్రమైన పెనుగంచి ప్రోలులో అదే గ్రామానికి చెందిన ఇంజన్ మేధ కంటి శాస్త్రి చికిత్స కోసం పది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్ళింది. బుధవారం ఉదయం ఇంటి పక్కన వారు చూసేసరికి ఇంటి వెనక తలుపులు పగలగొట్టి ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రూ.30 వేలు నగదు, వెండి వస్తువులు చోరీ అయినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండి గ్రామీణ ప్రజలను కూడా చైతన్యపరచాలని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం మచిలీపట్నం లోని కష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా చైర్పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకత నేరమని, దీనిపై అందరూ అవగాహన పెంపొందించుకొని, ఈ దోపిడీని అంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏదైనా సంఘటన జరిగాక స్పందించడం కంటే ముందుగానే దాని గురించి తెలుసుకొని జాగ్రత్త పడితే చాలా మంచిదన్నారు. ఏమైనా అవసరమైతే మహిళా హెల్ప్ లైన్ నంబర్లు 181, 112 సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అదనపు ఎస్పీ వి నాయుడు, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఉష ,రెక్టారు బసవేశ్వర రావు, విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు రావూరి సూయజ్ పాల్గొని మానవ అక్రమ రవాణాపై మాట్లాడారు. తొలుత మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంపొందించే గోడపత్రాన్ని మహిళా చైర్పర్సన్ ఆవిష్కరించారు.

మాట్లాడుతున్న రాయపాటి శైలజా

బురద రోడ్డుపై నడక నరకమే

ప్రజాశక్తి-కోడూరు : బురదలో నడవలేకపోతున్నాం.. సిసి రోడ్డు నిర్మించాలని విశ్వనాథపల్లి గ్రామవాసులు కోరుతున్నారు. గ్రామంలోని భజంత్రీల వారి రోడ్డులో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని, ఈ రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షం వస్తే మోకాలు లోతు బురదలో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ వారికి ఎన్ని సార్లు మోర పెట్టుకున్న స్పందించడంలేదన్నారు.

టౌన్‌ప్లానింగ్‌పై కౌన్సెల్ అసంతృప్తి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా అధికారుల పనితీరు సమర్ధవంతంగా ఉండాలని ఇటీవల పెడన పట్టణ పర్యటనకు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సూచించిన విషయాన్ని బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపి ప్రసాద్ ప్రస్తావనకు తీసుకువచ్చారు. పట్టణంలోని 2 లాడ్జిలు, పలు వాణిజ్య షాపింగ్ మాల్స్ సైతం రెసిడెన్షియల్ జోన్ లో ఎలా అనుమతించారనే విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కొద్దిపాటి నివాస స్థలాల్లో ఎక్స్ సర్వీస్ మెన్ లకు సైతం నిబంధనలు వర్తింపచేసే అధికారులు వాణిజ్య సముదాయాలకు పన్ను విధింపులో ఎందుకు మినహాయింపులు ఇస్తున్నారని నిలదీశారు. అదేవిధంగా అజెండాలోని 15వ అంశంపై స్పందిస్తూ పాలకవర్గం వైసిపి 9 వార్డు కౌన్సిలర్ గరిక ముక్కు చంద్రబాబు 12వ, వార్డ్ జనసేన కౌన్సిలర్ మట్ట శివపావనికి మధ్య ప్రోటోకాల్ వివాదం తారాస్థాయికి చేరింది. కాగా మట్ట శివపావనికి ఇటీవల తెలుగుదేశం పార్టీలోకి మారిన 1,వార్డు కౌన్సిలర్ పద్మావతి,20 వార్డు కౌన్సిలర్ కోసనం కరుణ కుమారి మద్దతు తెలుపకపోగా, ప్రతిపక్ష వైసిపి కౌన్సిలర్ చంద్రబాబు మాటలను సమర్ధించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరి వాదనతో కొద్దిసేపు కౌన్సిల్ సమావేశం వేడెక్కింది. మున్సిపల్ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ కాగిత రామాంజనేయులు, టౌన్ ప్లానింగ్ అధికారిణి సజనకుమారి, శానిటరీ ఇన్స్పెక్టర్ హరి కిషోర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. బుధవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో రెడ్ క్రాస్ స్వచ్ఛంద రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకటకష్ణారావు శతజయంతి సందర్భంగా ఆగస్టు 4వ తేదీ ఉదయం 9 గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ మోపిదేవి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసరమైన చికిత్సలు పొందే రోగులు క్షతగాత్రులకు రక్తం అవసరం తిరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. డిగ్రీ చదివే విద్యార్థులు యువత జనసైనికులు తెలుగు యువత కార్యకర్తలు దివిసీమ రక్తదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యసం చిట్టిబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, బీసీ వైస్ చైర్మన్ బొచ్చు రఘునాథ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

యువతిని మోసగించిన టిడిపి నేత కుమారుడు

- మంత్రి సమక్షంలో బెదిరింపు
- ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతి తల్లి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : పెళ్లి పేరుతో మేకల జాహ్నవి అనే యువతిని టిడిపి నేత కుమారుడు ఇంటి నుంచి తీసుకెళ్లి మోసగించిన ఘటన మచిలీపట్నంలో బుధవారం వెలుగుచూసింది. మచిలీపట్నం నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో టిడిపి ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న పి.సుబ్రహ్మణ్యం కుమారుడు అభినవ్ మోసగించడంతో యువతి తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితుల కథనం ప్రకారం... అభినవ్, జాహ్నవి అనే యువతి ప్రేమించుకున్నారు. వారిద్దరూ మేజర్లు కావడంతో పెళ్లి చేసుకుంటానన్న హామీతో అభినవ్ ఆ యువతిని కుటుంబం నుంచి దూరంగా తీసుకెళ్లాడు. అయితే జాహ్నవిని ప్రేమించిన అభినవ్ తండ్రి సుబ్రహ్మణ్యం మచిలీపట్నం నగరపాలక సంస్థలో టిడిపి ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. జాహ్నవితో తన కుమారుడి పెళ్లి తప్పించేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన మంత్రి.... టిడిపి నేత కుమారుడిని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. బలవంతంగా పెళ్లి చేసినా జాహ్నవిని చంపేస్తామంటూ టిడిపి నేత సుబ్రహ్మణ్యం ఆ మంత్రి సమక్షంలోనే బహిరంగంగా హెచ్చరించాడు. దీంతో తమకు న్యాయం జరగదన్న ఉద్దేశంతో యువతి తల్లి మేకల సత్యవతిలో నెలకొంది. ఫిర్యాదు చేసినా పోలీసులు రోజుల తరబడి జాప్యం చేయడం, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇంటి నుండి తీసుకెళ్లి రోజుల తరబడి సహజీవనం చేసి తీరా తాను ఇంకా జీవితంలో సెటిల్ కాలేదని, పెళ్లికి రెండేళ్ల సమయం కావాలని అభినవ్ చెప్పడంతో యువతి తల్లి సత్యవతి ఆందోళనకు గురింది. దీంతో బుధవారం చిలకలపూడి పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో పోలీసులు ఆమెను హుటాహుటిన పోలీస్ వాహనంలోనే జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆమె ప్రాణాపాయం నుండి బయటపడింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మేకల సత్యవతికి, ఆమె కుమార్తె జాహ్నవికి పోలీసులు, ప్రజాప్రతినిధులు ఏ మేరకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

పోలీస్ స్టేషన్లో ప్రేమించుకున్న యువతీయువకులు

ముగిసిన ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా ప్లీనరీ

ప్రజాశక్తి - గుడివాడ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుడివాడ సుందరయ్య భవనంలో జరుగుతున్న కృష్ణాజిల్లా ప్లీనరీ సమావేశాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ప్లీనరీ సందర్భంగా ఎస్ఎఫ్ఐ స్వతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం జెండాని జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ ఆవిష్కరించగా, భగత్ సింగ్ చిత్రపటానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ నాయుడు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారం గంలోనికి మార్పులు తీసుకురావడం, యూనివర్సిటీల్లో వీసీలను నియమించక పోవడం, తాత్కాలిక వీసీలతో ఎంతవరకు యూనివర్సిటీల్ని నడుపుతారని ప్రశ్నించారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మండలానికి ఒక జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేసి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. పాఠశాల మౌలిక వసతులు కొనసాగించాలని సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించి వాళ్ళ మెస్ చార్జీలను పెంచాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కష్ణా జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, పూర్వ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, మాజీ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు పవన్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు ఈ. ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి హారిక, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సలీం, ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల అధ్యక్షులు జగన్ పాల్గొన్నారు.

హెల్త్ బీమా పేరుతో చికిత్స

- చివరికి డబ్బులు కట్టాలని వేధింపులు
- 'అనిల్ న్యూరో అండ్ ట్రోమా సెంటర్'పై బాధితులు ఆరోపణ

ప్రజాశక్తి - ఘంటసాల : హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో వైద్యం చేస్తామని చెప్పి మోసగించిన ఘటన విజయ వాడలో జరిగింది. అంతేగాక ఆ ఆస్పత్రి యాజమాన్యం రోగి కుటుంబ సభ్యులను భయపెట్టి లేఖ రాయించుకుని నిర్బంధిం చింది. బాధితుల కథనం ప్రకారం... కృష్ణాజిల్లా కంకిపాడు మండలం తెన్నేరు గ్రామానికి చెందిన లంకే ముక్తేశ్వరరావు...తన భార్య లంకె నాగసాయి మౌనిక జ్వరం కడుపునొప్పి వాంతులతో బాధపడుతుండడంతో ఈనెల 20న విజయవాడలోని బిలీఫ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి సిబ్బంది నివాబుపా ఆరోగ్య బీమా కార్డుపై నగదు రహిత చికిత్స అందిస్తామని చెప్పారు. సిబ్బంది కొన్ని పరీక్షలు చేసి రూ.15 వేల వరకు కటించుకున్నారు. అనంతరం తమ వద్ద నగదు రహితం (బీమా కార్డు ద్వారా) కుదరడంలేదని, చుట్టుగుంటలోని అనిల్ న్యూరో అండ్ ట్రోమా సెంటర్ కూడా తమదేనని, అక్కడ నగదు రహిత చికిత్స అందిస్తామని ఈనెల 22న అక్కడికి పంపారు. అక్కడికి వెళ్లిన వెంటనే అనిల్ న్యూరో ఆస్పత్రి యాజమాన్యం ఆరోగ్య బీమాపై నగరహిత చికిత్స అందిస్తామని చెప్పింది. తర్వాత 23న ఆరోగ్య బీమా వారికి పంపామని, ఆమోదం రాగానే తెలుపుతామని కాలయాపన చేశారు. 26న 'మీ ఇన్సూరెన్స్ రిజక్ట్ అయ్యింది, మీ చికిత్స పూర్తయ్యింది, మొత్తం బిల్లు రూ.87 వేలు కట్టాలి' అని చెప్పారు. దీంతో రోగి సంబంధికులు బీమా వారిని సంప్రదించగా, 'మీ సమస్యకు ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం లేదని, అందువల్ల బీమాను రిజెక్ట్ చేశాము' అని సమాధానమిచ్చారు. దీంతో అనీల్ ఆస్పత్రి వారిని చికిత్స గురించి నిలదీయగా తాము చికిత్స మొత్తం సక్రమంగా చేశామని చెప్పుకొచ్చారు. బిల్లుల వివరాలు అడగగా నాలుగు రోజులకు మందులు రక్తపరీక్షలు నిమిత్తం దాదాపు రూ.56 వేలు, రూమ్ అద్దె, ఇతర బిల్లులు కలిపి రూ.87 వేలు చూపారు. దీంతో అనుమానం వచ్చి బీమా కంపెనీ వారికి పంపిన బిల్లులు, చేతికి ఇచ్చిన బిల్లులు పరిశీలించగా, చాలా వ్యత్యాసం ఉంది. దీంతో మోసం జరిగిందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు రోగి కుటుంబ సభ్యులు వెళ్లారు. మూడు రోజుల నుంచి ఇంటికి పంపకుండా నిర్బంధించారని మాచవరం ఎస్ఐ, సిఐలను కలిసి సమస్యను వివరించారు. అయితే వారు కనీసం ఫిర్యాదు తీసుకోలేదు. స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న ఆస్పత్రి యాజమాన్యం చికిత్స మొత్తం తమ అంగీకారం ప్రకారం జరిగిందని రాసి పోలీసులకు చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటామని రాసిస్తే ఇంటికి పంపుతామని బెదిరించారు. తీరా లెటర్ రాసి ఇచ్చిన తర్వాత తాము చెప్పినంత డబ్బులు కట్టి ఇంటికి వెళ్లాలని నిర్బంధించారు. దీంతో నిస్సహాయ స్థితిలో ఈనెల 29న రూ.50 వేలు కట్టి బయటపడ్డారు. తమను మోసం చేసి మానసిక వేదనకు గురిచేసిన అనిల్ న్యూరో అండ్ ట్రోమా సెంటర్‌పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



బాధితులు

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- నందివాడ : మండల ప్రజా పరిషత్ నందివాడ పరిదిలోని జనార్ధనపురం గ్రామ పంచాయతీలో ఐవిఆర్‌యస్ కాల్స్ ఫీడ్ బ్యాక్ (శానిటేషన్ వర్క్ కి సంబంధించి) క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయడంలో భాగంగా మచిలీపట్నం నుండి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాదికారి కన్నమ నాయుడు పాల్గొన్నారు. పారిశుధ్యంకు సంబంధించి గ్రామస్తులతో మాట్లాడి వారి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

సత్యవతికి పరామర్శ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కూతురి ప్రేమ వ్యవహారంలో తమకు న్యాయం జరగదని పురుగు మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన మేకల సత్యవతిని బుధవారం మచిలీపట్నం వైసీపీ ఇన్చార్జ్ పేర్ని కష్ణమూర్తి పరామర్శించారు. మీకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మచిలీపట్నం నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఇతర మహిళ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు. అలాగే మేకల శివపార్వతి, ఆమె కుమార్తె లకు సత్వరమే న్యాయం చేయాలని ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలును మహిళా సంఘం కార్యదర్శి కే సుజాత, అధ్యక్షురాలు చిరువోలు జయలక్ష్మి బూర భవాని తదితరులు పరామర్శించారు.

దళితుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్

ప్రజాశక్తి -విజయవాడ : దళితుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గల ఎస్సీ కమిషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం, కుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ ఏడాది మొత్తం 135 ఎట్రాసిటీ కేసులు వచ్చాయని, 3 నెలల్లో 78 కేసులు వచ్చాయని అన్నారు. జిల్లాలో మొత్తం 13 ఎట్రాసిటీ కేసులు వస్తే అందులో 3 కేసులు మాత్రమే నమోదు చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే అట్రాసిటీ కేసులు వచ్చినా అధికారులు వాటిని నమోదు చేయడం లేదని తెలుస్తోందన్నారు. కొద్దిమంది అధికారులు కేసుల నమోదు చేయడంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు దారుడు పోలీస్ స్టేషన్‌కు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలన్నారు. కమిషన్ చైర్మన్‌గా విశేషాధి కారాలు ఉంటాయని, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిష్కారంలో రాజీపడేది లేదన్నారు. భూములకు సంబంధించి రీసర్వేలో పోలీసులకు ఏమైనా ఫిర్యాదులు వస్తే తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో సీట్ల కోసం చాలా డిమాండ్ ఉందని 300 సీట్లకు గానూ 3,000 మంది విద్యార్థులు అప్లై చేసే పరిస్థితులు ఉన్నాయని, అధికారులు దీన్ని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సుబ్రహ్మణ్యం హత్య విషయంలో ఎమ్మెల్సీ అనంత బాబు కేసుపై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతి చెందిన డాక్టర్ సుధాకర్ విషయంలో కూడా అవసరమైన న్యాయం చేస్తామన్నారు.

సిద్ధార్థ లెక్చరర్ శివనాగరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడలోని పి.బి. సిద్ధార్థ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల స్టాటిస్టిక్స్ అధ్యాపకులు కె.శివ నాగరాజుకు మద్రాసు విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి జి.చక్రవర్తి, సిద్ధార్థ అకాడమీ పాలకవర్గం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. చెన్నై లయోలా కళాశాల స్టాటిస్టిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.లియో అలెగ్జాండర్ పర్యవేక్షణలో మనుగడ డేటా విశ్లేషణలో పంపిణీ నమూనాల అధ్యయనంపై తాను సమర్పించిన సిద్ధాంత రచనకు పిహెచ్.డి.పట్టా లభించినట్లు పరిశోధకుడు శివనాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

నదీతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ చైతన్య

నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కృష్ణానది పరివాహక ప్రాంతాలలో బుధవారం సబ్ కలెక్టర్ చైతన్య ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో వెంకటేశ్వర్లులతో కలిసి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో ఉన్న పులిచింతల, నాగార్జున సాగర్ నుండి నీరు విడుదల చేస్తుండగా, ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో కృష్ణానది వరద పెరిగే అవకాశం ఉంది. కాబట్టి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశం. వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ సమీక్షిస్తున్నట్లు తెలిపారు. లంక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలపై సమాలోచనలు జరిపారు. వరద ఉధతి పెరిగితే ఆ ప్రాంతాలను ఖాళీ చేసిన వారికోసం ట్రక్ టెర్మినల్ వద్ద సహాయ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కొండపల్లి మున్సిపాలిటీ కమీషనర్ రమ్య కీర్తన తెలిపారు.

అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే ప్రధానం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే అర్జీలను గడువు లోగా అర్జీదారులు సంతప్తి చెందేలా పరిష్కరిం చడం ప్రధానమని.. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ.. ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, సర్వే, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ సేకరణ, రీ సర్వే, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డులు, ఈ-కేవైసీ, ప్రజా పంపిణీ వ్యవస్థ సరుకుల పంపిణీ తదితర అంశాలతో పాటు పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార నాణ్యత నిర్ధారణకు అర్జీదారుల సంతప్తే గీటురాయని.. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు, సర్వే-ల్యాండ్ రికార్డుల ఏడీ పి.త్రివిక్రమరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వెంచురా - 2025 ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మొఘల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా, వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వెంచురా 2025ను బుధవారం ప్రారంభించింది. రెండు రోజుల పాటు జరిగే ఉత్సాహభరితమైన సాహిత్య, సాంస్కృతిక ఉత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యా శాఖా అధికారి యు.వి.సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్ధార్థ అకాడమీ లాభాపేక్షలేని విద్యా సంస్థలను నడుపుతూ, సమగ్ర విద్యార్థుల అభివృద్ధిపై దృష్టి సారించి నిరంతరం అధిక నాణ్యత గల విద్యను అందిస్తూ ఎందరో విద్యార్థుల జీవితాలకు బంగారు బాటవేసిందని కొనియాడారు. అనంతరం కవితా పఠనం, ఇంగ్లీష్, తెలుగు సృజనాత్మక రచన, క్విజ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమి అధ్యక్షులు ఎం.రాజయ్య, ఉపాధ్యక్షులు వి.నాగ భూషణ్ రావు, జాయింట్ సెక్రటరీ, స్కూల్ కన్వీనర్ ఎస్.విష్ణు, పాలక సభ సభ్యులు పి.నాగ సాయి, మధుసూదన రావు, పి.జనార్ధన మూర్తి, టి.శ్రీహరి రావు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని సిబిఎస్ఇ పాఠశాలల నుండి దాదాపు 200 మంది విద్యార్థులు మొదటి రోజు ఉత్సాహంగా పాల్గొన్నారని ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.రోజ్ మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. జయలక్ష్మి తెలిపారు.

వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం

పలువురు వక్తలు పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : అడ్మిన్ డిసిపి కార్యాలయంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బాలలు మహిళల అక్రమ రావణాకు వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం అనే పోస్టర్‌ను డిసిపి కెజివి సరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ప్రజలందరిలో అవగాహన, చైతన్యం మరింత పెంచాలని, అందరి సహకారంతోనే మానవ అక్రమ రమాణా నిర్మూలన సాధ్యమని తెలిపారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్-ఎహెచ్‌టియు టీం సభ్యులు, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, విజయవాడ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు. **విస్సన్నపేట :** ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విస్సన్నపేట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి విద్యార్థులకు ఎంఇఒ సుధాకర్ కార్యక్రమ నిర్వాహకులు టి.సంధ్యా నాని మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా పెద్ద నేరమని ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి ఎక్కువగా జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మొదలగు విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు శోభారాణి, సురేష్ పాల్గొన్నారు. **తిరువూరు :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం దినదినాభివద్ధి చెందుతుంటే ఈమధ్య కాలంలో మానవ అక్రమ రవాణా కూడా పెరుగటం బాధాకరమని తిరువూరు అడిషనల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యతేజ ఆవేదన వ్యక్తం చేశారు. మండల న్యాయ సేవా అధికారిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శ్రీవాహిణి ఇంజనీరింగ్ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల వెంకటరెడ్డి అధ్యక్షతన సద స్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్న పిల్లలను, మహిళలను , యువకులను అక్రమ రవాణాచేసి అక్రమ పనులకు వినియోగిస్తున్నారని, దీన్ని అరికట్టాల్సిన బాధ్యత చదువుకున్న యువతీ, యువకుల మీద ఉందన్నారు. అక్రమ రవాణా ఎవరి దృష్టికైనా వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది ఎం.రాము, ఉచిత న్యాయ సహాయ న్యాయవాది ఎం.నాగేంద్ర ప్రసాద్, తిరువూరు ఎస్ఐ కెవిజివి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్ధనరావు, అర్.మోహనరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరులో మాట్లాడుతున్న తిరువూరు అడిషనల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సూర్యతేజ

అండర్ 19 బాల బాలికలకు చదరంగం పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎన్టీఆర్ జిల్లా చదరంగం సంఘం, గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 1న పడమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో అండర్ 19 బాల బాలికలకు వేరువేరుగా చదరంగం ఎంపికలు జరుగుతాయని నిర్వాహకులు మందుల రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలు ప్రశంస పత్రాలతో పాటు జాతీయ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 90 30 30 88 11 నంబర్లను సంప్రదించాలని కోరారు

2న ఎఫ్‌ఎపిటిఒ ధర్నా

ప్రజాశక్తి - విస్సన్నపేట : జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 2న ఎఫ్‌ఎపిటిఒ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని విస్సన్నపేట మండలం ఎఫ్‌ఎపిటిఒ రెడ్డిగూడెం మండలం ఎఫ్‌ఎపిటిఒ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం విస్సన్నపేటలో ఎఫ్‌ఎపిటిఒ సంఘాల నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కో చైర్మన్ గంధం రామారావు, ఎపిటిఎఫ్ మండల శాఖ ఎపిటిఎఫ్ అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్.వి.సూర్యనారాయణ రావు, విస్సన్నపేట మండలం యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.మురళి రెడ్డిగూడెం డిటిఎఫ్ మండల అధ్యక్షులు బి.రామారావు, డిటిఎఫ్ నాయకులు టి.యాకోబ్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు సిహెచ్.చంటిబాబు ఎస్‌టియు విస్సన్నపేట మండల జనరల్ సెక్రెటరీ రవి చంద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి - గంపలగూడెం : టౌన్ పరిధిలో ఉన్న గుడివాడ వెంకట కుమారి (72) కొంతకాలంగా వయోభారంతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు. తిరువూరు లైన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో మృతురాలి నేత్రాలను విజయవాడ ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి వైద్య బృందం నేత్రాలను స్వీకరించింది.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - వత్సవాయి : మనస్థాపంతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తుటీ కుంట్ల గ్రామానికి చెందిన పనితి గోపాలరావు (37) వత్సవాయిలో ఒక శుభకార్యానికి భార్యతో కలిసి వచ్చాడు. బంధువుల ఇంట్లో వివాహం అనంతరం భార్య నాగమణితో ఘర్షణ పడి అక్కడే ఉండి పోయాడు. భార్య స్వగ్రామానికి వెళ్ళిపోయింది. వత్సవాయిలో ఓ ప్రైవేట్ బంకు ఎదురుగా పొలంలో గోపాల్ రావు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వచ్చే ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.